క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



చలివేంద్రాన్ని ప్రారంభించిన చంద్రశేఖర్

సంగారెడ్డి: చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలో వాసవీ మా ఇల్లు సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్, ఆ సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంత కిషన్‌తో కలిసి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలో ఐబీ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఇంతియాజ్, వాసవీ మా ఇల్లు సభ్యులు తోపాజి హరీశ్, సంతోష్ గుప్తా, మధుమోహన్, శ్రీహరి, సుధాకర్, కాంగ్రెస్ నాయకులు జార్జ్ కిరణ్ గౌడ్, కసిని రాజు ఉన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



ధాన్యం కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్

హత్నూర (సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని తహసీల్దార్ పర్వీన్ షేక్ అన్నారు. మంగళవారం హత్నూర మండలం నస్తీపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తహసీల్దార్ పరిశీలించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లర్లకు పంపించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ధాన్యం ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రాగి అంబలి పంపిణీ



భక్తులకు పంపిణీ చేస్తున్న అంబలి

నారాయణఖేడ్: మండలంలోని కిషన్‌నాయక్ తండాలో మంగళవారం సేవాలాల్ మహరాజ్, భవానీమాత మందిరాల మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఎండ తీవ్ర ఎక్కువగా ఉండటంతో జీఎంఆర్ ఫౌండేషన్ సంచార వాహనం ద్వారా ఫౌండేషన్ ప్రతినిధులు భక్తులకు ఉచితంగా రాగి అంబలి పంపిణీ చేశారు.

భెల్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న భెల్ ఈడీ కేబీ రాజా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మేడే సందర్భంగా భెల్ యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం కార్మికులకు క్రీడాపోటీలను భెల్ ఈడీ కేబీ రాజా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడే సందర్భంగా కార్మికులకు క్రికెట్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, మహిళా కార్మికులకు త్రోబాల్, షటిల్, బ్యాడ్మింటన్, పిడబ్ల్యూడీ ఉద్యోగులకు చెస్, క్యారం టీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయని చెప్పారు. నిత్యం గంట సమయం క్రీడలకు కేటాయించడం వల్ల మనం ఎంతో ఆరోగ్యం ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జీఎం హెచ్‌ఆర్ డాక్టర్. సంధ్య కర్, ఏఐటీయూసీ అధ్యక్షులు ఎస్.డి.వి. కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌బాబు

కల్హేర్(నారాయణఖేడ్): ఉపాధి హామీ పథకం పనులపై నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ రమేష్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కల్హేర్ మండల పరిషత్తులో పంచాయతీ సెక్రటరీలు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కూలీల హాజరుశాతం పెంచాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ వేణుమాధవ్ ఉన్నారు. అలాగే, మండలంలో ఇందిరమ్మ ఇళ్లపై క్షేత్ర పరిశీలన జరుగుతుందని ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. ఇప్పటికే 12 గ్రామాల్లో స్థలం, తదితర అంశాలపై పరిశీలన పూర్తి చేశామన్నారు. మరో మూడు గ్రామ పంచాయతీలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.



ఇస్నాపూర్‌లో రోడ్డుపై బస్సుల కోసం ఎండలో వేచి ఉన్న ప్రయాణికులు

బస్ షెల్టర్లు లేక.. రోడ్లపై పాట్లు

ఎండల దంచి కొడుతున్నాయి.. మరో వైపు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు పడుతున్నారు. బస్సు కోసం ఎదురు చూడడానికి చాలా చోట్ల బస్‌షెల్టర్లు లేవు. నిలువ నీడ లేక చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తు న్నారు. జంక్షన్‌లో బస్సుల కోసం నిరీక్షించే సమయంలో ఎండ, వాన వచ్చినా తలదాచుకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇటు పాలకులు, అటు ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడం ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది.

- పాస్‌లున్నా ఆటోలను ఆశ్రయించాల్సిన వైనం
- మండుటెండలో ప్రయాణికుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు
- తాత్కాలిక ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు

పటాన్‌చెరు టౌన్: రోజురోజుకు ఎండలు తీవ్రతరం అవుతుండటంతో బస్టాప్‌ల వద్ద నీడ లేక ప్రయాణికులు అల్లాడిపోతున్నారు. గంటల కొద్ది రోడ్ల పక్కన బస్సుల కోసం నిరీక్షిస్తూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రహదారి పక్కన బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం పారిశ్రామికవాడ కావడంతో ఉద్యోగులు, రోజువారి కూలీలు, విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉంటుంది. హైదరాబాద్ వైపు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తుంటారు. షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇస్నాపూర్, పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీరామ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో బస్‌షెల్టర్‌లు లేక ప్రయాణికులు సమీపంలో ఉన్న దుకాణాలు, హోటల్ వద్ద నిలబడుతున్నారు. అయితే ఇస్నాపూర్ వద్ద రోడ్డు పనులు జరుగుతుండడంతో రహదారి పక్కనే ఎండలో బస్సు కోసం వేచి ఉండే పరిస్థితి నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకొని బస్టాప్‌ల వద్ద కనీసం తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని అవసరమైన ప్రాంతాల్లో బస్సు షెల్టర్లను నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

పాస్‌లు ఉన్నా.. ఆటోలను ఆశ్రయిస్తున్నారు..

బస్సు పాస్‌లు ఉన్న రోడ్డుపై ఎండలో నిల్చో లేక ఆటోలను ఆశ్రయిస్తే జేబులు ఖాళీ అవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు పాస్ ఉన్న పటాన్‌చెరు వైపు వెళ్లేందుకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుందని చిరుద్యోగులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. బస్సు షెల్టర్లు ఏర్పాటు చేస్తే ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు ఆర్టీసీకి ఆదాయం చేకూరుతుందని పలువురు సూచిస్తున్నారు.

రోడ్డుపై నిల్చునే పరిస్థితి నెలకొంది



ఇస్నాపూర్‌లో బస్సు షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపై నిల్చునే పరిస్థితి నెలకొంది. అసలే వేసవి కాలం కావడంతో ఎండ తీవ్రత భారీగా ఉంది. దీంతో బస్సులు వచ్చేంత వరకు స్థానికంగా ఉన్న హోటల్లో, దుకాణాల వద్ద ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తుంది.

– నిజాముద్దీన్ బాబా, ఇస్నాపూర్

ప్రమాదాలు జరిగే అవకాశం



ఇస్నాపూర్, చిటుకుల్, పాశమైలారం నుంచి పటాన్‌చెరు వైపు వెళ్లేందుకు ప్రయాణికులకు బస్సు షెల్టర్ లేకపోవడంతో రహదారి పక్కనే నిలబడుతున్నారు. మరోవైపు రోడ్డు విస్తీర్ణం పనులు జరుగుతున్నాయి. అధికారులు నాయకులు స్పందించి బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి.

– దశరథ్ దత్త, చిట్కుల్

కొలతల ప్రకారం పనుల నిర్వహణ

అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



పనులు పర్యవేక్షిస్తున్న చంద్రశేఖర్

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ పథకంలో అధికారులు సూచించిన కొలతల ప్రకారం పనులు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఝరాసంగం గ్రామ శివారులో చేపట్టిన పనులను ఆయన పర్యవేక్షించారు. పనుల వివరాలు, హాజరైన కూలీల సంఖ్యను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని కుప్పానగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకంలో ఒకరోజు కూలీ రూ. 307లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పూర్తిస్థాయిలో పనిచేసే సరైన కూలీ డబ్బులు పొందాలన్నారు. తమ పూర్తి పని దినాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఝరాసంగం పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించి ప్రతి ఒక్కరికి సరిపడా డబ్బులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీఓ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పీఆర్టీయూ అండ



ఆర్థిక సాయం అందజేస్తున్న లక్ష్మణ్

జోగిపేట(అందోల్): అనారోగ్యంతో మృతి చెందిన ఉపాధ్యాయుడి కుటుంబానికి పీఆర్టీయూ అండగా ఉంటుందని రాష్ట్ర పీఆర్టీయూ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్ అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన పీఆర్టీయూ సంఘం సభ్యుడు విష్ణువర్ధన్ కుటుంబానికి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎ.మాణయ్యతో కలిసి మంగళవారం సంఘం సంక్షేమ సంస్థ పక్షాన రూ.లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలే కాకుండా అనుకోకుండా జరిగిన సంఘటనల్లో మృతి చెందిన ఉపాధ్యాయులకు అండగా ఉంటామన్నారు. విష్ణువర్ధన్ చిన్న వయస్సులోనే మృతి చెందడం సంఘానికి, కుటుంబానికి ఎంతో నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో రూరల్ మండల శాఖ అధ్యక్షుడు రాజమల్లు, అర్బన్ శాఖ అధ్యక్షుడు నరోత్తం కుమార్, ప్రధాన కార్యదర్శులు మయాచారి, జనార్దన్‌గౌడ్, రాష్ట్ర, జిల్లా , మండల బాధ్యులు, మహేష్ కుమార్ చారి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రక్తదాన శిబిరానికి విశేష స్పందన

నారాయణఖేడ్: విశ్వగురు మహాత్మా బసవేశ్వరుడి 892వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ఖేడ్‌లోని బసవ మంటపంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 63 మంది యువకులు రక్తాన్నిదానం చేశారు. అనంతరం స్థానిక వీరశైవ లింగాయత్ బసవ సేన ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు వారికి, 15 ఏళ్లకు పైబడి వారికి రెండు విభాగాల్లో మహాత్మా బసవేశ్వరుడి, శరణుల వచనాల పోటీలను నిర్వహించారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని గొటిగార్‌పల్లిలో బుధవారం సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు మంజూరు కాగా పంచాయతీ కార్యాలయం వద్ద పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు విఠల్‌గౌడ్, బీరప్ప, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సల్మాలు పాల్గొన్నారు.

◆ మేడేను జయప్రదం చేయండి

పటాన్‌చెరు: మేడేను కార్మిక వర్గం ముందుండి జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విస్తృతంగా జెండా కార్యక్రమాలు , ఎక్కడికక్కడ ర్యాలీలు చేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. కార్మిక వర్గం పోరాడితేనే హక్కులు చట్టాలు కాపాడబడతాయన్నారు. పోరాడకుండా ఎటువంటి చట్టాలు, హక్కులు రావని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రాజయ్య, సీఐటీయూ నాయకులు వీరరావు , సదాశివరెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ హోరాహోరీగా కుస్తీపోటీలు

సదాశివపేట(సంగారెడ్డి): మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాల్లో మంగళవారం పట్టణంలోని జగద్గురు పంచాచార్య బసవ సేవాసదన్‌లో అతి ప్రాచీనమైన మల్లయుద్ధం పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన 16 మంది మల్లయోధులు పాల్గొన్నారు. పోటీల్లో కల్హేర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన సాయిలు ప్రథమ బహుమతిగా 50 గ్రాముల వెండి, కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన సురేష్‌కు ద్వితీయ బహుమతిగా 30 గ్రాములు, కల్హేర్ మండలానికి చెందిన నర్సింలు తృతీయ బహుమతిగా 20 గ్రాముల వెండి అభరణాలు రూ. 3 వేల నగదు అందజేసి ప్రోత్సహించారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం చౌకిమఠం అధ్యక్షుడు చీలమల్లన్న, గౌరవ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి పిల్లోడి విశ్వనాథం, కోశాధికారి వీరేశం, ఉపాధ్యక్షుడు బస్వరాజ్ పాల్గొన్నారు.

◆ నీటి కాలువలు ధ్వంసం

పటాన్‌చెరు టౌన్: రుద్రారం గ్రామంలో పెద్దచెరువు ఆయకట్టుకు వెళ్లే నీటి కాలువలను ధ్వంసం చేస్తున్న బాలాజీ యాజమాన్యంపైన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రుద్రారం గ్రామంలోని పెద్ద చెరువును పరిశీలించారు. పెద్ద చెరువు కట్టకు అనుకొని బాలాజీ బిల్డర్స్ యాజమాన్యం నిర్మాణాలు చేపడుతుందన్నారు. బఫర్ జోన్ ప్రాంతంలో నిర్మాణం చేపట్టడం వల్ల చెరువు కట్ట భవిష్యత్తులో దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బాలాజీ బిల్డర్స్ యాజమాన్యం సర్వే నంబర్ 338 నుంచి 415 సర్వే నంబర్ల వరకు 36 ఎకరాల భూములను గ్రామ రైతుల ద్వారా కొనుగోలు చేశారు. సహజ సిద్ధంగా ఉన్న పెద్ద చెరువు అలుగుల నుంచి ఆయకట్టుకు వెళ్లే నీటి కాలువలను పూర్తిగా కబ్జా చేసిందని ఆరోపించారు. నిర్మాణాలు కూడా కొనసాగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు శ్రీనివాసు, సత్యనారాయణ, వెంకటేష్, శ్రీనివాసు, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి



గాలన్నను సన్మానిస్తున్న స్థానికులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించిన గాలన్నకు మంగళవారం పీహెచ్‌సీలో పదవి విరమణ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సత్తయ్య మాట్లాడుతూ.. ఉద్యోగులు చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. స్థానికులు గాలన్నను శాలువాతో సన్మానించారు. దాదాపు 15 ఏళ్ల నుంచి ఇక్కడే విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి, ఆయుర్వేదిక్ వైద్యులు డాక్టర్ నారాయణరావు, ఎంపీఓ సుభాష్, ఏఎన్ఎం చంద్రబాబు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భూభారతిపై అవగాహన

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం భూభారతి పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి మంగళవారం ఓ ప్రకటనలు పేర్కొన్నారు. ఈ సదస్సులో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి స్థానిక రైతులు హాజరు కావాలని కోరారు.

కవి మొగిలి మాలకు సన్మానం



జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కొడకంచి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కవి మొగిలి మాలను కరీంనగర్‌కు మహతి సాహితీ కవి సంగమం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. నగరంలోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో తాను రాసిన ఆట వెలది పద్యాలు విశ్వావసు ఉగాది సంకలనంలో ముద్రించారు. ఈ సందర్భంగా మొగిలి మాలను అభినందిస్తూ బంగారు నంది, ప్రశంసాపత్రాన్ని ప్రముఖ కవి రంగస్థలం నటుడు సినీగేయ రచయిత వెంకటరామినాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. నిర్వాహకులకు మొగిలి మాల ధన్యవాదాలు తెలిపారు.

నేడు బసవేశ్వర జయంతి

సదాశివపేట(సంగారెడ్డి): మహాత్మా బసవేశ్వర జయంతోత్సవ వేడుకలు బుధవారం ఎడ్లబాజర్ వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బసవేశ్వర జయంతి మందిరంలో ప్రత్యేక పూజలు, మహారుద్రాభిషేకం, ధ్వజారోహణం, సామూహిక ప్రార్థన, బసవేశ్వరుడి డోలారోహణ, బసవేశ్వరుని ఉత్సవ విగ్రహ శోభయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. వీరశైవులందరూ భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రథోత్సవం ప్రారంభం



స్వామివారి రథాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని కొల్కూర్‌లో మంగళవారం సదాశివ ఆలయ రథోత్సవం ప్రారంభమైంది. ఆలయంలో అగ్నిగుండం, అభిషేకాలు, మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. అంతకుముందు భక్తులు స్వామివారి రథాన్ని గ్రామ పురవీధుల గుండా ఆలయం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: రైతులకు అన్నివిధాలా అండగా ఉండటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం ఖేడ్ మండలం ర్యాకల్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను మద్దతు ధరతో చివరి గింజ వరకూ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేసిందని విమర్శించారు. అనంతరం భూభారతి చట్టంతో రైతులకు కలిగే ప్రయోజనాలు వివరించారు. నాయకులు పండరిరెడ్డి, రమేష్ చౌహాన్, వినోద్‌పాటిల్, వెంకట్‌రెడ్డి, జైపాల్‌యాదవ్, చంద్రారెడ్డి, సంగారెడ్డి పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవులివ్వాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

సంగారెడ్డి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించి.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. మున్సిపల్‌లో కాంట్రాక్ట్ కార్మికులుగా అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనంతో పనిచేస్తున్నా.. వారి శ్రమను ప్రభుత్వాలు గుర్తించక పోవడం దారుణమన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న కార్మికులకు అన్యాయమే జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు చనిపోతే మట్టి ఖర్చులు నిమిత్తం 30 వేలు ఇవ్వాలని తక్షణ సాయంగా ఆ కుటుంబానికి ఆదుకోవాలన్నారు. కార్మికులకు వానాకాలంలో రెయిన్ కోట్లు, చలికాలంలో స్వెటర్లు, సంవత్సరానికి ఒక్కసారి తప్పనిసరిగా సబ్బులు, బట్టలు, కొబ్బరి నూనె, షూలు ఇతర సామగ్రిని అందించాలన్నారు. వివిధ విభాగాలలో పనిచేస్తున్న చదువు, వత్తి నైపుణ్యాన్ని గుర్తించి డ్రైవర్లుగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా కంప్యూటర్ ఆపరేటర్లుగా మొదటి ప్రాధాన్యతనిచ్చి ప్రమోషన్లు కల్పించాలన్నారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ. 25 లక్షల బీమా, పీఎఫ్, ఈఎస్ఐ అవకాశాన్ని కల్పించాలన్నారు. కార్మికుల ఖాతాల్లో ఈఎస్, పీఎఫ్ డబ్బులు కొన్ని మున్సిపాలిటీల్లో జమ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు సువర్ణ, రాజు, శీను, సుగుణ, సంగీత, నర్సింలు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే ముఖ్యం

అడిషనల్ డీఆర్‌డీఓ బాల్‌రాజ్



ఉపాధి పనులపై తనిఖీ చేస్తున్న అధికారులు

వట్‌పల్లి(అందోల్): ఉపాధి కూలీకి పని కల్పించడమే ముఖ్యమని అడిషనల్ డీఆర్‌డీఓ బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం వట్‌పల్లి ఎండీపీఓ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై 4వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన 214 వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. మండలంలో మొత్తం రూ.3,61,18,859 కోట్లు ఖర్చు చేయగా కూలీల వేతనాలకు 3,22,96,243 కోట్లు, 38,22,616 లక్షలు సామగ్రి చెల్లింపులు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధిహామీ సిబ్బంది పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై సంబంధిత అధికారులు రోల్‌కాల్ చేయకపోవడం, కొలతల్లో తేడాలు, మస్టర్లలో కూలీల సంతకాలు, హాజరు లేకుండా వేతనాలు చెల్లింపులు, మస్టర్ల హాజరు గణన లెక్కింపులో తప్పిదాలు, పని ప్రదేశం తేడాలు వంటి తప్పిదాలపై మండలంలోని 21 గ్రామ పంచాయితీలకు గాను రూ.55 వేల రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ కింద చేపట్టిన 24 రకాల పనులకు రూ. 2,34,51,851 కోట్ల పనులు చేపట్టగా వీటికి సంబంధించి రికార్డులు సమర్పించకపోవడంతో తనిఖీ చేపట్టలేదని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక తనిఖీ విజిలెన్స్ అధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ అంజయ్య, ఏపీఓ శ్యామ్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే మాణిక్‌రావు



శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే,శంకర్‌పాటిల్

జహీరాబాద్ టౌన్: ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. బసవ జయంతి పురస్కరించుకుని రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బసవ మండపంలో మంగళవారం రక్తదాన, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన, వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు 6 నెలలకు ఒక సారి రక్తదానం చేయవచ్చని చెప్పారు. రక్తదాతలకు ఆయన సర్టిఫికెట్లను అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే బసవేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శంకర్‌పాటిల్, శరణప్ప, నాగేష్, నాయకులు ఉన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పారిశ్రామికవేత్తలు

పటాన్‌చెరు టౌన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మంగళవారం పటాన్‌చెరు పారిశ్రామికవేత్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఐలా కార్యాలయం నుంచి ర్యాలీగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాల వేసి, తిరిగి అక్కడి నుంచి గాంధీపార్క్ వద్దకు వచ్చి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు సుధీర్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, శ్రీనివాస్, రమేష్, హనుమంతరావు, రంజిత్, సలీం, దుర్గ పాల్గొన్నారు.



జహీరాబాద్ పట్టణంలో

జహీరాబాద్‌లో

జహీరాబాద్ టౌన్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఉమర్ ఫారూక్ మజీద్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. పర్యాటకులను కాల్చిచంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం నివాళులర్పించారు.